'ఎంఎస్‌డబ్ల్యూ'తో అవకాశాలు మెండు

రాయదుర్గం: సోషల్ వర్క్ అనేది జాబ్ ఓరియంటెడ్ సబ్జెక్ట్ అని 'మనూ' సోషల్ వర్క్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ షాహిద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మనూ విశ్వ విద్యాలయంలో రెండు సంవత్సరాల మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) కోర్సును అందిస్తోందన్నారు. అభివృద్ధి రంగంలో అవకాశాలు ఏటా పెరుగుతున్నాయని ఎంఎస్‌డబ్ల్యూ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఉర్దూ పరిజ్ఞానంతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ/తత్సమాన కోర్సుల్లో 45 శాతం మార్కులతో ఆసక్తి గల దరఖాస్తుదారులు ఎంఎస్‌డబ్ల్యూ కోర్సునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ జూన్ 30వ తేదీ అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9958222106లో సంప్రదించాలని సూచించారు.

బాల సంస్కార శిక్షా కేంద్రం వేసవి శిక్షణా శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న కొండలరావు, శ్రీనివాస్‌గౌడ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో బాల సంస్కార శిక్షా కేంద్రం ద్వారా వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. హిందువులు ప్రతి రోజు పఠించవలసిన శ్లోకాలను ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు నేర్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో సరస్వతి, స్వర్ణలక్ష్మీ, రజనీ, హరీష్‌లు నిర్వహించారు. ఈ శిబిరంలో మొదటి వారంలోనే సుమారు 80 మంది చిన్నారులు పాల్గొన్నారు. ప్రతి రోజు శ్లోకాలు, ఆటలు, కథలు, నేర్పుతారు. వారాంతంలో స్వాతంత్ర్య ఉద్యమకారుల జీవిత చరిత్రలు, నీతి కథలు చెబుతారు. అదే విధంగా ఆల్విన్‌కాలనీలోని శిశుమందిర్‌లో 15 మంది పిల్లలతో రెండవ బ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్వర్ణలక్ష్మీ, నందినిలు సహకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిభ చూపిన చిన్నారులకు ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ్ చాలక్, కొండలరావు, బీజేపీ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్‌లు బహుమతి అందజేశారు. ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు అందరూ హిందూ సంస్కృతిని, సాంప్రదాయాల్ని ఆచరించాలని కోరారు.

శంకరమఠంలో రుద్రహోమం



మోతీనగర్: యజ్ఞం, హోమాలతో శాంతి సౌభాగ్యాలు కలుగుతాయని శ్రీ శృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ కార్యనిర్వహణ అధికారి సిఎస్ఆర్ మూర్తి పేర్కొన్నారు. శంకరమఠం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం రుద్రహోమం నిర్వహించారు. ఈ వేడుకలు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా మోహినీ పల్లకీ ఉత్సవం



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని భవ్యాస్ తులసివనంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మోహినీ పల్లకి ఉత్సవంను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా అన్న కూటోత్సవం, ఊంజల్ సేవ, గరుడోత్సవం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దేవదేవుని దర్శించుకున్నారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, ఆనంద్ ప్రసాద్, ఎంఆర్‌కె రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

28, 29వ తేదీల్లో కార్యక్రమాలివే..

28వ తేదీ సాయంత్రం రథోత్సవం, శ్రీవారి శాంతి కల్యాణ మహోత్సవం, ముత్యాల పల్లకి ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 29వ తేదీ వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం తిరువీధుల్లో అష్ట వాహనోత్సవం, ధ్వజారోహణ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిషేధిత గుట్కాలు పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుట్కాలను విక్రయిస్తున్న ఓ వ్యాపారిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 472 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని కానుకుంటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శేరిలింగంపల్లి పరిధిలోని చందానగర్‌లో నివాసం ఉండే ప్రభాకర్ రామచంద్రాపురంలోని కానుకుంటలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కాగా ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను అధిక మొత్తంలో విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రామచంద్రాపురం పోలీసులు ప్రభాకర్ దుకాణంపై దాడి చేసి వివిధ కంపెనీలకు చెందిన నిషేధిత 472 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిషేధిత గుట్కాలను అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

లోక కల్యాణం కోసం పర్యటన

రాజేంద్రనగర్: లోక కల్యాణార్థం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యటనను ప్రారంభించారు. కర్ణాటకలోని హంపి, కుక్కి సుబ్రహ్మణ్యం, ధర్మస్థలి మంజునాథ ఆలయం, మురుడేశ్వర్, గోకర్ణ, మూకాంబిక ఆలయాలను సందర్శిస్తామని సభ్యులు తెలిపారు. పూజా కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం సభ్యులు, సంఘ సేవకులు, పుర ప్రముఖులు పాల్గొని తెలంగాణలో, దక్షిణ భారతంలో వానలు బాగా కురిసి పంటలు పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కొలన్ సుభాష్ రెడ్డి, కొండమీది హరినాథ, కొమురయ్య, జైనాథ్ రెడ్డి, ఎస్.విజయ్ కుమార్, కొంగల బుచ్చన్న, మేడం మధు, రాములు, సిరిపాల్, కమలేకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులు 5 గోతులు 3 కిలోమీటర్లు

వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం

హఫీజ్‌పేట్: చందానగర్ నుంచి హఫీజ్‌పేట్ వరకు మంజీరా నూతన పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తి చేసిన చోట రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. సుమారు రూ.40 కోట్లతో 5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేస్తున్నారు. ఇప్పటి వరకు 3 కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. అయితే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ఇక చిన్నపాటి వర్షానికి రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనదారులు జారిపడుతున్నారు. భారీ వర్షం కురిసినప్పుడు పైప్‌లైన్ వేసిన చోట ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు. చందానగర్ గంగారం వద్ద భారీగా గుంతలు ఏర్పడ్డాయి. గత నాలుగు నెలల నుంచి ఆ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంజీరా రోడ్డులో వేలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. ఒక్కోచోట ఒక వాహనం వస్తే మరో వాహనం పక్కన ఆగాల్సిందే. పైప్‌లైన్ పనులు పూర్తి కావడానికి ఎన్నాళ్లుపడుతుందో? అని స్థానికులు వాపోతున్నారు.

- పైప్‌లైన్ పూర్తి అయిన 3 కిలోమీటర్ల రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- పనులు జరిగే చోట సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు రాత్రి సమయాలలో వీధి దీపాలు వెలిగేలా చూడాలి
- వర్షాకాలం దృష్ట్యా పైప్‌లైన్ పూర్తి చేసిన చోట జాగ్రత్తలు తీసుకోవాలి
- గంగారం వద్ద ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చి వేయాలి
- రోడ్డుకు ఇరువైపులా నో పార్కింగ్ బోర్డులు ఉంచాలి
- మంజీరా రోడ్డు నూతన పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలి.





గుంతలరోడ్లతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



చందానగర్‌లో పైప్‌లైన్ పనులు చేసిన చోట ఎగుడుదిగుడుగా మారిన రోడ్డు

రోడ్డుపైకి రావాలంటే భయం వేస్తోంది



చందానగర్‌లో చేపట్టిన నూతన పైప్‌లైన్ పనులతో భారీగా ఏర్పడ్డ గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనం తీసుకొని రోడ్డుపైకి రావాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నా. ఇప్పటికైన అధికారులు గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– మదనచారి, వాహనదారుడు

వర్షాకాలం వస్తోంది



పైప్‌లైన్ పనులు పూర్తి అయిన చోట గుంతలు ఏర్పడ్డాయి. చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారుతోంది. రానున్నది వర్షాకాలం. భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అధికారులు స్పందించాలి.

– అశోక్, వాహనదారుడు

దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలోని ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ ఒక్కొక్క గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో మొత్తం 160సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బాలికలు ఉచిత హాస్టల్ వసతికి అర్హులని తెలిపారు.

పగలూ.. వెలుగులే..





వివేకానందనగర్‌లో పగలు వెలుగుతున్న వీధి లైట్లు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్‌ను ఆదా చేయండి అని చెప్పే అధికారులకు ఇది పట్టదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటం లేదని అధికారులు దృష్టికి తీసుకువచ్చినా సమస్యను పరిష్కరించడం లేదని వారు తెలిపారు. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో విషాదఛాయలు

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని సాయినగర్, యూత్‌కాలనీలలో ఆదివారం సాయంత్రం గాలి దుమారానికి పిట్టగోడ కూలి రషీద్ (55), ఇంటి రేకుల పైకప్పు పడి బాలుడు సమద్ (5) మృతి చెందిన ఘటనలో వారి ఇళ్ల వద్ద విషాదం నెలకొంది. సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు.



రషీద్ (ఫైల్)



సమద్ (ఫైల్)

మృత్యువు వచ్చిందిలా..

సాయినగర్‌లో నివాసముండే రషీద్ ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి మెయిన్ రోడ్డుపైకి రాగా గాలి దుమారానికి మూడవ అంతస్తు పిట్టగోడ కూలి రషీద్‌పై పడింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రషీద్ మృతి చెందాడు.

ఆడుకుంటూ మృత్యు ఒడిలోకి..



సాయినగర్ కాలనీలో ఆ కుటుంబాల ఇళ్ల వద్ద విషాదఛాయలు

సాయినగర్ కాలనీలో నివాసముండే బాలుడు సమద్ ఇంటి బయట ఆడుకుంటుండగా ఈదురుగాలికి పక్క వీధిలో ఉన్న రేకుల షెడ్డు ఎగిరి బాలుడు సమద్‌పై పడ్డాయి. తీవ్ర గాయాలై బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన విదితమే.

ముగిసిన 'సోషల్ ఇంటెలిజెన్స్ బూట్‌క్యాంప్-24'

రాయదుర్గం: నానక్‌రాంగూడలో క్యాటలిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన 'సోషల్ ఇంటెలిజెన్స్ బూట్‌క్యాంప్-2024' సోమవారం ముగిసింది. మూడు రోజులపాటు వక్తల ప్రసంగాలు, అనుభవాన్ని పెంచేలా వర్క్‌షాప్‌లు జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం డాక్టర్ ఉషా యనమండ్ర రచించిన 'ఎస్‌ఐ–ది సోషల్ ఆల్కెమీ: క్రాఫ్టింగ్ సక్సెస్ త్రూ సోషల్ ఇంటెలిజెన్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముగింపు కార్యక్రమంలో క్యాటలిస్ట్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఉషా మాట్లాడుతూ వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి, నైపుణ్యాలు పెంచుకోవడానికి ఇవి దోహదం చేస్తాయన్నారు. అనంతరం ఈ క్యాంప్‌లో పాల్గొన్నవారికి ఉషా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



సర్టిఫికెట్ అందచేస్తున్న క్యాటలిస్ట్ సంస్థ వ్యవస్థాపకులు డా.ఉషా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



హఫీజ్‌పేట్: నల్లగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

- అపర్ణ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు నల్లగండ్ల హుడా, నల్లగండ్ల గ్రామం, మెయిన్‌రోడ్డు వైపు ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- నేతాజీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి 3.00 గంటల వరకు నేతాజీనగర్, గుల్ మోహర్ పార్కు వైపు ఏరియాలలో ..
- ప్రతిమ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రతిమ విల్లాస్, గోపన్‌పల్లి తండా, ముప్ప రోడ్డు ప్రాంతాలలో ..
- రైల్‌విహార్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు సాయిబాబా టెంపుల్, సిటిజన్ కాలనీ, శివాజీనగర్, భారత్ పెట్రోల్ బంకు వైపు, గిద్దంగి ఏరియాలలో..
- చందానగర్ హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సా.4.00 గంటల వరకు చందానగర్ హుడా కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

ఆల్విన్‌కాలనీ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: 11 కెవి ఆదిత్య నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు తులసినగర్ రోడ్డు నంబర్ 1, 2, హెచ్‌ఎంటీ హిల్స్ వాటర్ టాంక్ లైన్, 11కెవి జలవాయు విహార్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఈఈ తెలిపారు.

గచ్చిబౌలి: పీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో.. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మ. 1 గంట వరకు టెలికాంనగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఆర్‌టీటీసీ, టెలికాంనగర్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొండాపూర్ పరిధిలో..

జాగృతి ఫీడర్ పరిధిలో.. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జాగృతి కాలనీ, శ్రీనివాస్ కాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ ఉండదని కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.అలాగే 8వ బెటాలియన్ ఫీడర్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, కొత్తగూడ విలేజ్, 8వ బెటాలియన్ క్వార్టర్స్, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. కొత్తగూడ ఫీడర్ పరిధిలో కొత్తగూడ మెయిన్‌రోడ్డు, కొత్తగూడ విలేజ్, ప్రశాంత్‌నగర తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: రాంనరేష్‌నగర్, శ్రీలా గార్డెన్ ఫీడర్ పరిధిలో.. మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాంనరేష్‌నగర్, ఓల్డేజ్ హోం, మిత్రహిల్స్, మధ్యాహ్నం 1.30 నుండి 3 గంటల వరకు శ్రీలా గార్డెన్ ,ఎస్‌సీబీ నగర్, నడిగడ్డతండా, 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు రాంనరేష్‌నగర్, నందమూరి నగర్, ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

వీడియోకాలనీ, మియాపూర్, ఎస్ఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుండి 12.30 గంటల వరకు మదీనాగూడ మెయిన్ రోడ్డు, విజేత సూపర్ మార్కెట్ ఏరియా, కల్కి చాంబర్ అపార్ట్‌మెంట్, వీఆర్ బార్ ఏరియా, ఆల్విన్ ఎక్స్ రోడ్డు, మధ్యాహ్నం 1.30 నుండి 3 గంటల వరకు ఎస్ఎంఆర్ మెట్రోపాలిట్, లేక్ వ్యూ రెసిడెన్సి, ఆర్‌బిఆర్ కాంప్లెక్స్, బాలాజీ నగర్, తిరుమల అపార్ట్‌మెంట్, అంగారా హోటల్ ఏరియా, మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు మియాపూర్ మెయిన్‌రోడ్డు, ఎస్ఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్, ఫ్రెండ్స్ కాలనీ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, రోడ్డు నంబర్లు 1 నుంచి 6, శ్రీదేవి థియేటర్ మెయిన్ రోడ్డు, కైలాస్‌నగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- సురక్ష ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు సురక్ష ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, రెడ్డి కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ హిల్ విల్లాస్ ప్రాంతాలలో..
- కెపిఎస్ఆర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు కెపిఎస్ఆర్ ఎన్‌క్లేవ్, రోడ్డు నెంబర్ 1 నుంచి 13, ఇన్ఫినిటీ స్కూల్, అపర్ణ రోడ్డు ఏరియాలో విద్యుత్ ఉండదన్నారు.

20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం



రమేష్ (ఫైల్)

గచ్చిబౌలి: సెక్యూరిటీ గార్డు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా లింగంపేట్‌కు చెందిన కొత్త రమేష్(30) కొండాపూర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా ఈ నెల 15న డ్యూటీలో చేరాడు. 20న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇప్పుడే వస్తానని చెప్పి కాలేజీ నుంచి బయటకు వెళ్లాడు. ఊరికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి కిష్టమ్మ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న సంతోష్ ఎం.దాసరి

మాదాపూర్: ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే విజయాలను సాధిస్తారని ఎస్ఐటీ (స్విచ్ 2 ఐటీ)సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్ వ్యవస్థాపకుడు సంతోష్ ఎం.దాసరి తెలిపారు. మాదాపూర్‌లోని అవాస హోటల్‌లో సోమవారం నాన్ ఐటీ నుంచి ఐటీకి వెళ్ళేవారు ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలో తెలిపే మెళకువల కోసం ఎస్ఐటీ బూట్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంపులో దాదాపు 100 మందికి పైగా పాల్గొన్నారు. తమ వెబ్‌సైట్‌లో(స్విచ్2 ఐటీ జాబ్స్.కామ్) పూర్తి వివరాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ పాల్గొన్నారు.


స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పంజాబ్ అమృత్‌సర్ స్వర్ణ దేవాలయాన్ని సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకటరెడ్డి, పాండు, మాణిక్ ప్రభు, రాజు పర్యటనలో ఉన్నారు.

ఓవైపు మంచినీరు.. మరోవైపు మురుగునీరు

రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధానరోడ్లపై నీరు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలోని పీజేఆర్ విగ్రహం వద్ద మంచినీటి పైపులైన్ వాల్వ్‌లు లీకై నీరు రోడ్డు పాలవుతోంది. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు రోడ్లపై పారుతోంది. దీంతో ఆ ప్రాంతం దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇక మంచినీటిలో కలుషిత జలాలు సరఫరా అయి తాగలేని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కలుషిత నీరు, డ్రైనేజీ ఇళ్లముందు పారుతుండటంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం నడవలేని పరిస్థితి నెలకొందని వాహనాల రాకపోకలతో నీరు పాదచారులపై పడటంతో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి వాల్వ్ లీకేజీ, మ్యాన్‌హోల్ పొంగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



రిక్షాపుల్లర్స్ కాలనీలో మంచినీటి వాల్వ్‌ల లీకేజీతో పారుతున్న నీరు



రిక్షాపుల్లర్స్ కాలనీలో పారుతున్న మురుగునీరు